క్లుప్తంగా

పుష్కలంగా యూరియా నిల్వలు



నున్న(విజయవాడరూరల్): గ్రామంలో దాళ్వా సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ సహాయకులు మౌనిక తెలిపారు. గురువారం 25 టన్నుల యూరియా వచ్చిందని పేర్కొన్నారు. 45 కిలోల యూరియా బస్తాను రూ.267 చొప్పున రైతులు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ-క్రాప్ ఆధారంగా రైతులకు యూరియా విక్రయిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు నున్న గ్రామంలో రైతుభరోసా కేంద్రానికి 96.255 టన్నుల యూరియా వచ్చిందని, రైతులు 71 టన్నులు కొనుగోలు చేశరని వివరించారు.

నేడు రేణుకా అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



కంకిపాడు: దేవినేని వారి ఇలవేల్పు శ్రీ రేణుకా అంకమ్మతల్లి అమ్మవారి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం జరుగుతాయని శ్రీ రేణుకా అంకమ్మ తల్లి ట్రస్టు ప్రతినిధులు దేవినేని ప్రేమ్‌కుమార్, దేవినేని ఉపేంద్ర, దేవినేని రవీంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని నెప్పల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం 8.47 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, మహాకుంభాభిషేకం జరుగుతాయని పేర్కొన్నారు. అమ్మవారి విగ్రహంతో పాటుగా శిఖర, బలిపీఠం, పోతురాజు స్వామి వార్ల ప్రతిష్ట జరుగుతుందని తెలిపారు. నందివెలుగు శ్రీబాలాజీ గురుకుల్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, ప్రతిష్ట ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ చేస్తామని తెలిపారు.

హెచ్‌సీ చొరవతో 108కు మార్గం సుగమం



గన్నవరం: నిత్యం రద్దీగా ఉండే చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై గురువారం గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మలుపు తిరుగుతూ ఓ స్కూల్ బస్సు అర్ధంతరంగా నిలిచిపోయింది. దీంతో ఏలూరు నుంచి విజయవాడ వెళ్లే రూటులో కిలోమీటర్ పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. ఈ ట్రాఫిక్‌లో అత్యవసర సేవలు నిమిత్తం వెళ్తున్న 108 అంబులెన్స్ కూడా చిక్కుకుపోయింది. అక్కడ విధుల్లో ఉన్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ తాతయ్య వెంటనే స్పందించి స్కూల్ బస్సును స్థానికుల సాయంతో నెట్టుకుంటూ పక్కకు తప్పించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో 108 వాహనం కుయ్.. కుయ్ మంటూ విజయవాడ వైపు వేగంగా దూసుకువెళ్లింది. ట్రాఫిక్ కానిస్టేబుల్ తాతయ్యను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

కంకిపాడు: రోడ్డు ప్రమాదంపై స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పమిడిముక్కల మండలం మంటాడ పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెంనకు చెందిన నీలాపు అప్పారావు ఆటో కార్మికుడు. ఈ నెల ఎనిమిదో తేదీన పెనమలూరు నుంచి కంకిపాడు వైపు వస్తుండగా వెనుక వైపు వచ్చిన కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో అప్పారావుకు గాయాలయ్యాయి. అతనితో పాటుగా ఆటోలో ప్రయాణిస్తున్న కాకుళ్ల బెనర్జీ కూడా గాయపడ్డాడు. వారు ఉయ్యూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నారు. అప్పారావు ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

12న ఉచిత వైద్య శిబిరం

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరులో ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈ నెల 12వ తేదీన ట్రస్ట్, రమేష్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో గుండె, మెదడు, కీళ్లు, ఎముకలు, ఊపిరితిత్తులు, నేత్ర, దంత పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ర్యాండమ్ షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో, ఎముకల దృఢత్వ పరీక్షలను కూడా ఉచితంగా చేస్తారని వివరించారు. వైద్య పరీక్షలకు వచ్చే వారితోపాటు వారి సహాయకులకు కూడా ఉచిత భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

గుడివాడ ఆర్డీఓ పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి

గన్నవరం: మండలంలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని గుడివాడ ఆర్డీఓ పద్మావతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై ఆర్డీఓ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ పద్మావతి మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులను త్వరితగతిన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో ఎంపికైన లబ్ధిదారులు అందరూ గృహ నిర్మాణాలు చేపట్టేలా సమయత్తం చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా గృహ నిర్మాణాలు పూర్తిచేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గృహ నిర్మాణాలకు దశల వారీగా బిల్లులు మంజూరు చేయడంతో పాటు ఉచిత ఇసుక, రాయితీపై సిమెంట్, ఐరన్ సరఫరా చేయాలని ఆదేశించారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి సుబ్బారావు, తహసీల్దారు సీహెచ్.నరసింహారావు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ సాయి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉగాదికి గృహ ప్రవేశాలు

నున్న(విజయవాడరూరల్): ఉగాది పండుగ సందర్భంగా జగనన్న కాలనీల్లో నిర్మించిన ఇళ్లలో గృహ ప్రవేశాలు జరుగుతాయని హౌసింగ్ ఏఈ రామకృష్ణ తెలిపారు. నున్న గ్రామంలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాన్ని ఆయన గురువారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గీత, వంశీ, శశాంక్, షణ్ముఖ్‌తో కలిసి పరిశీలించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని ఇక్కడ స్థలాలు పొందిన రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల లబ్ధిదారులకు ఏఈ సూచించారు. సిమెంటు, ఐరన్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పైపు లీకేజీల వల్ల నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని పలువురు లబ్ధిదారులు పేర్కొనగా హౌసింగ్ ఏఈ రామకృష్ణ స్పందించి వెంటనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. రామవరప్పాడు పేదలకు 1,152 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయగా 75 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, 1072 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉందని ఏఈ తెలిపారు. ప్రసాదంపాడు గ్రామస్తులకు 1,131 ఇళ్లను మంజూరు చేయగా 57 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, 1,074 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉందని వివరించారు.

సిటీ బస్సు పునరుద్ధరణకు ఆర్టీసీ అధికారుల అంగీకారం



గవర్నర్‌పేట డీఎం బసవయ్యకు వినతిపత్రం అందచేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పెనమలూరు: మండలంలోని యనమలకుదురు గ్రామానికి విజయవాడ నుంచి సిటీ బస్సు నడపాలని వైఎస్సార్ సీపీ నేతలు, గ్రామస్తులు కోరిన మేరకు ఆర్టీసీ అధికారులు అంగీకారం తెలిపారు. ఈ మేరకు ఆర్టీసీ గవర్నర్‌పేట డిపో మేనేజర్ బసవయ్య, రూట్ అధికారి సునీత యనమలకుదురు గ్రామంలో గురువారం బస్సు ట్రయిల్ రన్ నిర్వహించారు. ఆర్టీసీ అధికారులకు వైఎస్సార్ సీపీ నేతలు కోసూరి నరేష్‌కుమార్, ఫజల్‌హక్, షేక్ కరీముల్లా వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 50 వేల మంది జనాభా ఉన్నారని, ఆర్టీసీ సిటీ బస్సులు గ్రామానికి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. గతంలో 7బీ, 7ఆర్, 7వై నంబర్లతో తిరిగే సిటీ బస్సులను రద్దు చేశారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గవర్నర్‌పేట డిపో మేనేజర్ బసవయ్య స్పందించి, బస్సు ట్రయిల్ రన్ నిర్వహించారు. విజయవాడ కాశేశ్వరరావు మార్కెట్ నుంచి పాతచెక్ పోస్టు, లాకుల మీదగా తాడిగడప డొంక రోడ్డు నుంచి పప్పులమిల్లు వద్ద బందరు రోడ్డుకు చేరేలా రోజుకు ఎనిమిది ట్రిప్పుల వరకూ బస్సులు నడపాలని నిర్ణయించారు. త్వరలో బస్సు సర్వీసు ప్రారంభిస్తామని డీఎం తెలిపారు. ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకుడు రావి సుబ్బారావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్‌డీఆర్‌ఎఫ్ సేవలు నిరుపమానం



రెస్క్యూ ఆపరేషన్‌లో సేవలందిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది



సమావేశంలో పాల్గొన్న డీఐజీ మనోజ్‌కుమార్ యాదవ్, కమాండెంట్ జాహిద్ ఖాన్

గన్నవరం రూరల్: ఎన్‌డీఆర్‌ఎఫ్ సేవలు నిరుపమానమని సౌత్ అండ్ సౌత్ సెంట్రల్ డీఐజీ మనోజ్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గన్నవరం మండలం కొండపావులూరులో ఉన్న ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ క్యాంపును ఆయన వార్షిక సందర్శనలో భాగంగా గురువారం తనిఖీ చేశారు. క్వార్టర్ గార్డ్ వద్ద జవాన్‌ల నుంచి కమాండెంట్ జాహిద్‌ఖాన్‌తో కలసి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణ కేంద్రం, పరిపాలన విభాగం, సిబ్బంది వసతి గృహాలు, స్టోర్స్, పార్క్ ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో డీఐజీ మనోజ్ కుమార్ యాదవ్ కార్యాచరణ, పరిపాలన అంశాలు చర్చించారు. సైనిక్ సమ్మేళన్ నిర్వహించి జవాన్‌ల సమస్యలు, ఫిర్యాదులు పరిష్కరించారు.

డీఐజీ మనోజ్‌కుమార్ యాదవ్

డీఐజీ ఎదుట ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ప్రకృతి వైపరీత్యాల సమయంలో స్పందించే తీరును విన్యాసాల రూపంలో ప్రదర్శించారు. ఎత్తయిన బిల్డింగ్‌లో ప్రమాదాలు జరిగితే రోప్ రెస్క్యూ టీమ్ అందించే సేవలను సమీక్షించారు. దేశవ్యాప్తంగా అత్యవసర, ఆపద సమయాల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ అందించే సేవలను, విజన్ ప్రాముఖ్యత వివరించారు. సవాళ్లను అధిగమిస్తూ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ, పనితీరును మెరుగు పరుచుకుంటూ ఎన్‌డీఆర్‌ఎఫ్ అందిస్తున్న సేవలను దేశం హర్షిస్తోందని కొనియాడారు. అనంతరం ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ క్యాంపు ఆవరణలో డీఐజీ మొక్కను నాటారు.

వీరపనేనిగూడెం జెడ్పీ స్కూల్లో విచారణ

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీఈఓ తాహెరా సుల్తానా ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు గురువారం విచారణ నిర్వహించారు.

హెచ్‌ఎం ఆలపాటి వెంకటేశ్వరరావు, హిందీ ఉపాధ్యాయిని శివకుమారి మధ్య వివాదం నెలకొంది. ఆత్కూర్ పోలీస్ స్టేషన్‌లో శివకుమారి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై బుధవారం పాఠశాలలో వాగ్వివాదం జరగడం, దానిని హెచ్‌ఎం వెంకటేశ్వరరావు వాట్సాప్ గ్రూపులో షేర్ చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు తీవ్రంగా స్పందించారు. విద్యాశాఖ ఏడీ అజీజ్, ఏఎస్ఓ అశోక్, కంకిపాడు ఎంఈఓ కనకమహాలక్ష్మి, గన్నవరం ఎంఈఓ శ్రీనివాసరావు పాఠశాలను గురువారం సందర్శించి, ఉపాధ్యాయులతో విడివిడిగా సమావేశమై వారి అభిప్రాయాలు సేకరించారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల ప్రగతి, మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. అధికారులు తమ నివేదికను డీఈఓకు సమర్పించనున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందిపై కేసు

పెనమలూరు: మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు.. పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో గురువారం వాహనాలు తనిఖీ చేయగా మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మంది పట్టుబడ్డారు. వారిపై పోలీసులు కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశారు.

ఎస్సార్కేలో ఉత్సాహంగా ఎక్స్‌ప్లోరర్స్ మీట్



తమ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



ప్రసంగిస్తున్న అణు విద్యుత్ కేంద్రం సీనియర్ ఇంజినీర్ తుమ్మల పాండురంగారావు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం ఎక్స్‌ప్లోరర్స్ మీట్ - 2023 కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. కళాశాలలోని ఈసీఈ, ఈఈఈ, ఐటీ విభాగాల విద్యార్థులు పలు రకాల ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఐటీ విభాగం ఆధ్వర్యంలో స్మార్ట్ డస్ట్‌బిన్, వాయి కాలుష్యం డిటెక్టర్, స్మార్ట్ ఫైర్ అలారం, స్మార్ట్ పార్కింగ్, స్మార్ట్ హోమ్ ఆటోమెషిన్, ఈసీఈ విభాగం విద్యార్థులు హోమ్ సెక్యూరిటీ, గ్రీన్‌హౌస్, ట్రాఫిక్ కంట్రోల్, ఈఈఈ విభాగం విద్యార్థులు ఐఓటీ టెక్నాలజీ ఉపయోగించి పలు నమూనాలు, స్మార్ట్ ఫోన్‌తో ఆటోమెటిక్ హోమ్ అప్లియన్స్ కంట్రోల్‌ను తయారు చేసి మన్ననలు అందుకున్నారు. టెక్నికల్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తేసే విధంగా పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పోలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అణు విద్యుత్ కేంద్రం ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ డిపార్టుమెంట్ సీనియర్ ఇంజినీర్ తుమ్మల పాండురంగారావు హాజరై విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించి అభినందించారు. కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు, సెక్రటరీ శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, జీడీకే కిషోర్, ఏఓ ప్రతాప్, హెచ్‌ఓడీలు ఎస్.నాగేశ్వరరావు, శ్రీగౌరి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన రైన్ సెన్సార్, ఈ-హెల్మెట్, స్మార్ట్ అగ్రికల్చర్ మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ సిస్టమ్ నమూనాలు ప్రధాన ఆకరణగా నిలిచాయి.

విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు



విద్యుత్ శాఖ కంకిపాడు సెక్షన్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఈఈ హరిబాబు

కంకిపాడు: మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఈఈ పి.హరిబాబు సూచించారు. కంకిపాడు విద్యుత్ సెక్షన్ కార్యాలయం, కంకిపాడు, ఉప్పలూరు, కోలవెన్ను, ఈడుపుగల్లు, ప్రొద్దుటూరు విద్యుత్ సబ్‌స్టేషన్లను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెక్షన్ కార్యాలయం, సబ్‌స్టేషన్ల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ హరిబాబు మాట్లాడుతూ.. విద్యుత్ లూజు లైన్లు ఉన్న ప్రాంతాలను గుర్తించి హుటాహుటిన మరమ్మతులు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమర్థంగా విద్యుత్ పంపిణీ జరిగేలా చూడాలని స్పష్టంచేశారు. విద్యుత్ బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని, బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. తనిఖీలో ఏఈ తాళ్లూరి అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 15లోగా రీ-సర్వే ప్రక్రియ పూర్తి చేస్తాం

కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రంజిత్‌బాషా, ఇతర అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో మార్చి 15వ తేదీలోపు రీ-సర్వే ప్రక్రియ పూర్తిచేస్తామని ఉన్నతాధికారులకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. భూపరిపాలన శాఖ కమిషనర్ జి.సాయిప్రసాద్ సచివాలయం నుంచి గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ-సర్వే పురోగతి, జగనన్న భూహక్కు - భూరక్ష పత్రాల మంజూరు తదితర అంశాలపై ఆయన కలెక్టర్లతో సమీక్ష జరిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 335 గ్రామాల్లో రీ-సర్వే పూర్తయ్యిందని తెలిపారు. మరో 94 గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియను మార్చి 15వ తేదీలోపు పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. డ్రోన్ ప్లై, గ్రౌండ్ ఫ్లోటింగ్ ముందు అందరికీ నోటీసులు పంపుతున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఆర్డీఓలు, తహసీల్దార్ నుంచి వీఆర్వో వరకు రీ-సర్వే పనులు పర్యవేక్షిస్తున్నారని వివరించారు. విధి నిర్వహణలో ఎవరైనా అలక్ష్యం వహిస్తే వారిపై చర్యలు సైతం తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇంకా 21 గ్రామసభలు నిర్వహించాల్సి ఉందన్నారు. త్వరలో వాటిని నిర్వహిస్తామన్నారు. రీసర్వే పనులు మరింత చురుకుగా చేసేందుకు 100 రోవర్లు అవసరమని కమిషనర్ దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు ఐ.కిషోర్, పద్మావతి, విజయకుమార్, సర్వే ఏడీ గోపాలరాజా, సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం 79 శాతం పూర్తి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఇతర అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో ఓటరు కార్డుతో ఆధార్‌కార్డు అనుసంధానం చేసే ప్రక్రియ 79 శాతం పూర్తయిందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిపై సమీక్షించారు. కృష్ణా జిల్లాలో ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం 79 శాతం పూర్తి చేయటంతో పాటు ఫారం-6, 7, 8లలో కనబరిచిన పనితీరుకు కలెక్టర్‌ను సీఈఓ అభినందించారు. జిల్లాలో కొత్తగా ఓటు నమోదు కోసం ఫారం-6 ఉపయోగించాలని, నకిలీ ఓటర్లు, ఇతర ప్రదేశాలకు వెళ్లిన వారు, కొత్తగా వివాహమై ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, పునరావృతమైన పేర్లు తొలగింపునకు ఫారం-7, మార్పుల కోసం ఫారం-8ను ఉపయోగిస్తూ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఫారం-6బీ ద్వారా ఓటరుకార్డును ఆధార్‌కార్డుతో అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. ఓటరు జాబితాలో డూప్లికేట్ల ఫొటోలు, పేర్లు, చిరునామాల పట్ల దృష్టి పెట్టాలన్నారు. కొత్తగా ఓటు నమోదుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని, ముఖ్యంగా 18, 19 సంవత్సరాల మధ్య వయసు వారికి ఓటరుగా నమోదు చేయటంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు ఐ.కిషోర్, పి.పద్మావతి, విజయకుమార్, ఎంయూడీఏ వీసీ నారాయణరెడ్డి, డీఎస్ఓ వి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీరమ్మతల్లి తిరునాళ్ల





ఆలయంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కుటుంబం, అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న అంగడాల బుజ్జి

ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్లు కొనసాగుతున్నాయి. తిరునాళ్ల మహోత్సవం పదో రోజు కావటంతో వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వీరమ్మతల్లిని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. ప్రజలందరూ చల్లగా ఉండేలా అమ్మవారి దీవెనలు ఉండాలని కోరుకున్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ప్రసాదాల పంపిణీ కొనసాగుతోంది. ఉత్సవాల సందర్భంగా గురువారం ఇండియన్ గ్యాస్ అధినేత, బీసీ నేత అంగడాల బుజ్జి గురువారం అన్నప్రసాదం పంపిణీ చేశారు. అమ్మవారి సంతర్పణకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు.

దంత వైద్య విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లిలో ఉన్న డాక్టర్ సుధ అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు జరిగాయి. అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మ్యాక్సిలో ఫేషియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను హెచ్‌ఓడీ డాక్టర్ కోటేశ్వరరావు పర్యవేక్షించారు. నోరు, ముఖం, దవడలు శస్త్ర చికిత్స విధానాలకు సంబంధించి దంత వైద్య విద్యార్థుల్లో సృజనాత్మకత, అవగాహన పెంచేందుకు ఈ పోటీలను నిర్వహించామన్నారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.రామోజీరావు, ఏఓ వై.మధుసూదనరావు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి



ఉయ్యూరు: పట్టణంలోని ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో విజయవాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల కన్వీనర్ తాతినేని శ్రీహరిరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీహరిరావు మాట్లాడుతూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని, రక్తదానంతో ప్రాణదాతలు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ సి.వి.సత్యనారాయణ, క్లబ్ కార్యదర్శి కె.కిరణ్‌కుమార్, సభ్యుడు జె.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శేఖర్‌బాబు, ఎంఎల్ఎస్ కుమారి, పి.శ్రీరామ్‌తేజ, కోఆర్డినేటర్ ఎండీ నూర్ పాల్గొన్నారు.

ఫేక్ అకౌంట్లతో ఎమ్మెల్యే పార్థసారథిపై కుట్ర

ఉయ్యూరు: ఫేక్ అకౌంట్లు సృష్టించి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి లక్ష్యంగా జరిగే కుట్రపూరిత రాజకీయాలను సాగనివ్వబోమని వైఎస్సార్ సీపీ నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు స్పష్టంచేశారు. స్థానిక టౌన్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ వీరప్రసాద్‌ను గురువారం రాత్రి కలిసి ఎమ్మెల్యే పార్థసారథి పేరుమీద క్రియేట్ చేసిన ఫేక్ అకౌంట్‌పై ఫిర్యాదుచేశారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దుర్భాషలాడుతూ కె.తారక రామారావు ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి పోస్టు పెట్టి దానిని పెనమలూరు నియోజకవర్గం సోషల్ మీడియా ఫేస్ బుక్ పబ్లిక్ గ్రూప్‌కు ట్యాగ్ చేసిన ఘటనపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐను కోరారు. ఎమ్మెల్యే పార్థసారథిపై ఉద్దేశ పూర్వకంగానే కుట్ర పూరిత రాజకీయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్లు వడుపు కార్తీక్, ఆరేపల్లి శ్రీకాంత్, దిరిశం ఇందిరా ప్రియదర్శిని, పార్టీ పట్టణ అధ్యక్షుడు జంపాన కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లయింట్ ఏలూరు జిల్లా పెదపాడు మండలం, సత్రంపాడు గ్రామము, శ్రేయ ఎస్టేట్స్, ఎ.ఎ. ప్లాజా, ఫ్లాట్ నెం. 204, కాపురస్తులు ధూళిపాళ్ళ భానుప్రకాష్ గారి భార్య ధూళిపాళ్ల రాజశ్రీ గారి సంకాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, మా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఐటమ్ నెం. ఎ దాఖలా స్థిరాస్థి కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, పోరంకి గ్రామ కాపురస్తులు ఉండ్రాళ్ళ బసవయ్య గారి కుమారుడు కోటేశ్వరరావు వద్ద నుండి ది. 28.11.2001న కొనుగోలుచేసి గుణదల రిజిస్ట్రారు వారి ఆఫీసు నందు డాక్యుమెంట్ నెం. 2488/2001గా రిజిష్టరు చేయించుకొనియున్నారు మరియు ఈ దిగువ షెడ్యూలు ఐటమ్ నెం. 8 దాఖలా స్థిరాస్థి కృష్ణాజిల్లా, విజయవాడ రూరల్ మండలం, గూడవల్లి గ్రామ కాపురస్తులు కొలుసు నాగభూషణం గారి కుమారుడు రామారావు వగైరాల వద్ద నుండి ది. 25.08.2004న కొనుగోలు చేసి గుణదల రిజిష్ట్రారు వారి ఆఫీసు నందు డాక్యుమెంట్ నెం. 2469/2004గా రిజిష్టరు చేయించుకొని యున్నారు. ఇలా ఉండగా ది. 06.02.2023న సాయంత్రం 7 గం.ల సమయంలో ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఒరిజినల్ దస్తావేజు నెం. 2488/2001 మరియు దస్తావేజు నెం. 2469/2004 ఇంకా కొన్ని పేపర్లు ఫోటోస్టాట్ తీసుకొనుటకు గన్నవరం సెంటర్ వద్ద గల ఫోటోస్టాట్ షాపునకు వెళ్ళి చూసుకొనగా నా ఒరిజినల్ దస్తావేజులు పోయినవని గుర్తించారు. ఎంత వెతికినను దొరకలేదని తెలియజేసియున్నారు. కావున పైన తెలిపిన దస్తావేజులు ఎవరికైనను దొరికిన యెడల మాకు గానీ, మా క్లయింటుకు గానీ అందచేయగలరు. అట్లుగాక సదరు దస్తావేజులను ఉపయోగించి ఏ విధమైన లావాదేవీలు జరిగినయెడల అవి చట్ట ప్రకారము చెల్లనేరవని మా క్లయింటును బైండు చేయజాలవనియు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయటమైనది.

షెడ్యూలు:

ఐటమ్ నెం. ఎ: కృష్ణాజిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, గూడవల్లి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన గూడవల్లి గ్రామం దాఖలా

ఐటం నెం. 1: ఆర్.ఎస్.నెం. 170/10A దాఖలా య. 0.04 సెంట్లు మరియు ఆర్.ఎస్.నెం. 170/12 దాఖలా య. 0.21 సెంట్లు భూమికి హద్దులు. తూర్పు: 2వ ఐయిటం భూమి కొంత వరకు, శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం భూమి కొంత వరకు, దక్షిణం: మీ తాలూకు వ్యవసాయ భూమి. పడమర: వేముంలపల్లి పిచ్చయ్య వగైరాల భూమి, ఉత్తరం: అయినంపూడి నాగభూషణం గారి కుమారుడు అయినంపూడి ప్రభాకర్ గారి భూమి, ఈ హద్దుల మధ్య య. 0.25 సెంట్లు శేరి పల్లం భూమి.

ఐటం నెం. 2: ఆర్.యస్.నెం. 170/12 దాఖలా య. 0.15 సెంట్లు భూమికి హద్దులు. తూర్పు: వేముంలపల్లి విజయ నిర్మల వగైరాల భూమి. దక్షిణం: మీ తాలూకు వ్యవసాయ భూమి, పడమర: 1వ ఐయిటం భూమి, ఉత్తరం: శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం భూమి. ఈహద్దుల మధ్య య. 0.25 సెంట్లు శేరి పల్లం భూమి. ఈ హద్దుల మధ్య య. 0.15 సెంట్లు శేరి పల్లం భూమి, ఐటం నెం. 1 మరియు 2లు వెరశి మొత్తము య. 0.40 సెంట్లు భూమి

ఐటమ్ నెం. బి: కృష్ణాజిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, గూడవల్లి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన గూడవల్లి గ్రామం దాఖలా

ఐటం నెం. 1: ఆర్.ఎస్.నెం. 55/1 దాఖలా య. 0.38 సెంట్లు, ఆర్.ఎస్.నెం. 55/2 దాఖలా య. 0.07 సెంట్లు, ఆర్.ఎస్.నెం. 55/3 దాఖలా య. 0.36 సెంట్లు మరియు ఆర్.యస్.నెం. 170/12 దాఖలా య. 0.16 సెంట్లు వెరశి మొత్తము య. 0.97 సెంట్లు భూమికి హద్దులు. తూర్పు: సత్రా వెంకటేశ్వరరావు గారి భూమి, దక్షిణం: శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం భూమి, పడమర: కొలుసు శ్రీనివాసరావు గారి వలన మీరు క్రయమును పొందిన భూమి. ఉత్తరం: సూర్యనారాయణ శాస్త్రి గారి భూమి, ఈ హద్దుల మధ్య య. 0.97 సెంట్లు శేరి పల్లం భూమి

ఐటం నెం. 2: ఆర్.ఎస్.నెం. 170/12 దాఖలా య. 0.20 సెంట్లు భూమికి హద్దులు. తూర్పు: శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం భూమి, దక్షిణం: సత్రా వెంకటేశ్వరరావు గారి వలన క్రయమును పొందిన భూమి. ఈ హద్దుల మధ్య య. 0.37 సెంట్లు శేరి పల్లం భూమి. ఈ ఐటం నెం. 1 మరియు 2లు వెరశి మొత్తము య. 1.34 సెంట్లు భూమి.

ఈడ రాజేష్ బాబు, అడ్వకేట్
డోరు నెం. 10-147, దుర్గాపురం, కేసరపల్లి గ్రామం,
గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. ఫోన్: 91770 55353